క్లుప్తంగా

ఇద్దరు ఎస్‌ఐలకు ఎస్పీ సత్కారం



నగరంపాలెం: ప్రజలకు నేరుగా సేవలు అందించడం పోలీస్ శాఖలోనే సాధ్యమని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ అన్నారు. ఉద్యోగ విరమణ చేయనున్న ఎస్‌ఐలు శ్రీనివాసరావు (తాడేపల్లి పీఎస్), పి.సాంబశివరావు (ఏఆర్)లను శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఆయన సత్కరించి, జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగంలో చేరడం గొప్ప అదృష్టమన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని పేర్కొన్నారు. అన్ని వేళలా వారికి అండగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ హనుమంతు, ఆర్‌ఐలు శ్రీహరిరెడ్డి, బ్రహ్మానందం, డి.శ్రీనివాసరావు, స్వర్ణలత, పోలీస్ అసోసియేషన్ సభ్యులు మైల సాంబశివరావు, హుస్సేన్, కరిముల్లా, లక్ష్మణ్, జానయ్య పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరి జీవితంలో బాల్యం కీలకం



నెహ్రూ నగర్: ప్రతి ఒక్కరి జీవితంలో బాల్యం ఎంతో ప్రాముఖ్యమైనదని, ఈ దశలో ఏర్పడే మానసిక అభివృద్ధి, వయోజన దశపై ప్రభావం చూపుతుందని స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శామ్యూల్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక నెహ్రూ నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌లో అప్పర్ కిండర్ గార్డెన్, ప్రైమరీ విద్యార్థులకు సర్టిఫికెట్ ప్రధానం (గ్రాడ్యుయేషన్ డే) చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. బాల్య దశను సక్రమంగా నడిపించడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ప్రముఖమైందన్నారు. సైకియాట్రి కౌన్సిలర్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు మాట్లాడుతూ మారుతున్న విధానాలను తల్లిదండ్రులు స్వాగతించాలన్నారు. పిల్లలకు తగిన సమయాన్ని కేటాయించి, ఏది మంచి, ఏది అవసరమో తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్కూల్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపల్ సుజాత, పిన్నబోయిన శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

రూ.2.44లక్షల నగదు స్వాధీనం

గుంటూరు ఈస్ట్: కారులో నగదు తీసుకెళుతున్న వ్యక్తి వద్ద ఎన్నికల అధికారులు డబ్బులు స్వాధీనం చేసుకున్నారు. పట్టాభిపురం పోలీసులు వివరాల మేరకు.. విద్యానగర్ సమీపంలో శనివారం జగదీశ్వరరెడ్డి అనే వ్యక్తి కారులో రూ. 2,44,500లు తీసుకెళ్తున్నాడని, ఎన్నికల అధికారులు కారు తనిఖీ చేస్తున్న సమయంలో నగదును స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌లో అప్పగించారని తెలిపారు.

మహిళ ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: మహిళ ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎస్వీఎన్ కాలనీలో నివశించే మహేశ్వరి కుమార్తె గోరంట అంబిక (23) వ్యక్తిగత కారణాలతో మానసికంగా కృంగిపోయి శనివారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫార్మసీ కళాశాలకు ఐఎస్ఓ సర్టిఫికెట్ అందజేత

తెనాలిఅర్బన్: తెనాలి బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలను ఐఎస్ఓ ప్రతినిధులు శనివారం తనిఖీ చేశారు. ఐఎస్ఓ సర్టిఫికెట్ రెన్యువల్ చేసే కార్యక్రమంలో భాగంగా కళాశాలకు వచ్చిన వారు పరీక్ష ఫలితాలు, లైబ్రరీ, లెబొరేటరీ, డిజిటల్ తరగతి గదులు వంటి వాటిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరమణకు ఐఎస్ఓ ప్రతినిధులు కె.కుటుంబరావు, ఎ.సింగయ్యలు సర్టిఫికెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఐఎస్ఓ టీమ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.సాయిరాజేష్, సభ్యులు కె.కళ్యాణ్ చక్రవర్తి, సిహెచ్.నాగశైలజ, టి.లక్ష్మీ దుర్గా, ఎ.సోనీ ప్రియాంక పాల్గొన్నారు.

నిలువుటద్దం 'గోపాత్రుడు'

తెనాలి: వాస్తవాలతో కాకుండా ఉద్వేగాలు, విశ్వాసాల ఆధారంగా సత్యాన్ని నిర్ధారిస్తున్న 'పోస్ట్ ట్రూత్'ను 'గోపాత్రుడు' నవలలో అధిక్షేపణ ప్రక్రియతో కేఏవై పతంజలి శక్తివంతంగా వివరించినట్టు ప్రముఖ సాహిత్య విమర్శకుడు జి.లక్ష్మీనరసయ్య అన్నారు. ఆహ్వానం లక్ష్మి సంస్మరణలో స్థానిక సాహితీ, సాంస్కృతిక సంస్థ 'భిన్నస్వరాలు' ఆధ్వర్యంలో శనివారం ఇక్కడి కవి రాజ పార్కులోని వీజీకే భవన్‌లో కేఎన్వై పతంజలి నవల 'గోపాత్రుడు'పై చర్చా వేదికను నిర్వహించారు.

ప్రతి గడపకూ మెరుగైన వైద్యం

తూర్పు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి నూరి ఫాతిమా



పార్టీలో చేరిన వారితో నూరి ఫాతిమా

పట్నంబజారు: ప్రతి గడపకు మెరుగైన వైద్యం.. నాణ్యమైన విద్య.. అవ్వాతాతలకు, దివ్యాంగులకు ప్రతి నెలా 1వ తేదీన పింఛను అందిస్తూ ప్రతి ఇంటిలో సుఖ సంతోషాలు విరబూసేలా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందించారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరి ఫాతిమా పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 15వ డివిజన్, కొబ్బరికాయల సాంబయ్య కాలనీ, కిడాంబి నగర్‌లో శనివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూరి ఫాతిమా మాట్లాడారు. ప్రతి గడపకు సీఎం జగనన్న అందించిన సంక్షేమ పథకాలు చేరాయన్నారు. కుల, మత, ప్రాంత, రాజకీయ భేదాలు లేకుండా అర్హతే ప్రమాణికంగా పథకాలు అందజేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో పేద వర్గాలకు అండగా ఉన్నామనే భరోసా కల్పించి, రానున్న ఎన్నికల్లో పేదల పక్షాన యుద్ధం చేసేందుకు సీఎం జగనన్న సిద్ధమవుతున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో తమ ఇంటి బిడ్డగా తూర్పు నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రామనబోయిన అజయ్‌యాదవ్, వైఎస్సార్ సీపీ నేతలు మద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మురళి, నాగేశ్వరరావు, నరసింహారావు, పఠాన్ జానీ, నన్నే భాయ్, అంజిరెడ్డి, వెంకటేశ్వర్లు, రాంబాబు, చెంచయ్య, మస్తాన్, హనుమంతరావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురు చేరిక

పట్నంబజారు: తెలుగుదేశం పార్టీలో ముస్లిం మైనార్టీలు ఇమడలేని పరిస్థితి ఏర్పడిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరి ఫాతిమా అన్నారు. శనివారం బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని ఎమ్మెల్యే షేక్ మొహ్మద్ ముస్తఫా కార్యాలయంలో రెండో డివిజన్ కార్పొరేటర్ మర్రి అంజలి, వైఎస్సార్ సీపీనేత సత్యనారాయణ ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన ఖాదర్‌బాషా, ఆపార్టీ నేతలు, యువకులు, వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా నూరి ఫాతిమా మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి పేదవాడు తిరిగి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలన కోరుకుంటున్నారన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమం అందాలంటే సీఎం జగనన్న ముఖ్యమంత్రి కావాలన్నారు. జగనన్న చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను మరోమారు ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. అనంతరం పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి, సాదరంగా ఆహ్వానించారు.



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నూరి ఫాతిమా

ఈవీఎంల భద్రతకు తగిన ఏర్పాట్లు చేయాలి

జీఎంసీ కమిషనర్, తూర్పు ఆర్‌ఓ కీర్తి చేకూరి



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈవీఎం కమిషనింగ్, పంపిణీ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల్లో తగిన ఏర్పాట్లు తక్షణం చేయాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ) కీర్తి చేకూరి పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక ఏసీ కాలేజీలోని మీటింగ్ హాల్స్, తరగతి గదులను ఈవీఎంల కమిషనింగ్, పంపిణీ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల్లో తగిన ఏర్పాట్లకు అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గంలో వినియోగించే ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల కమిషనింగ్, స్ట్రాంగ్ రూమ్, పంపిణీ కేంద్రాలను స్థానిక ఏసీ కాలేజీలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించామన్నారు. కళాశాల ప్రతినిధులను అడిగి తరగతి గదులు, మీటింగ్ హాల్స్, మౌలిక వసతులు, పార్కింగ్ తదితర అంశాలను తెలుసుకున్నారు. ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లను ఆయా విభాగాల ఉన్నతాధికారులు, ఏఆర్‌ఓలు ప్రత్యక్ష పరిశీలన చేసి, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. కళాశాల ప్రతినిధులతో సమన్వయం చేసుకొని, స్ట్రాంగ్ రూంలో ఈవీఎంల ఏర్పాటు, కమిషనింగ్ కేంద్రంలో మార్కింగ్ చేసి బ్లూ ప్రింట్ సిద్ధం చేయాలని సిటీ ప్లానర్, సర్వేయర్‌ని ఆదేశించారు. ఈవీఎంల కమిషనింగ్, పంపిణీ కేంద్రంలో సిబ్బందికి విధులు కేటాయిస్తూ ప్రొసీడింగ్స్ సిద్ధం చేయాలని మేనేజర్‌ను ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి కమిషనింగ్ కేంద్రానికి అసెంబ్లీ, పార్లమెంట్ ఈవీఎంలను వేర్వేరుగా తెచ్చేలా చూడాలన్నారు. విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌ఓలు సునీల్, భీమరాజు, వెంకటలక్ష్మి, సెక్టోరల్ అధికారి శ్రీధర్, ఈఈ సుందరరామిరెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, మేనేజర్ ఎస్ఎన్.ప్రసాద్, సర్వేయర్ లోకేష్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎంల వినియోగంపై సమగ్ర అవగహన తప్పనిసరి

ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు ఈవీఎంల వినియోగంపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని, అందుకు తగిన శిక్షణ అందిస్తున్నామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు, సిబ్బందికి ఈవీఎంల నిర్వహణపై డెమో ఇచ్చారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల పని తీరుపై సెక్టోరల్, రూట్ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రధానంగా ఈవీఎంలు, వీవీ ప్యాట్లు కమిషనింగ్, పోల్ సమయంలో ఎదురయ్యే సాంకేతిక సమస్యల పరిష్కారించేలా సిద్ధమవ్వలన్నారు. మాస్టర్ ట్రైనర్ల ద్వారా నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామన్నారు.

వైఎస్సార్ సీపీ విజయాన్ని అడ్డుకోలేరు



బార్ అసోషియేషన్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డిని సన్మానిస్తున్న విప్ లేళ్ల అప్పిరెడ్డి

- బార్ అసోసియేషన్ ఎన్నికల్లో గెలుపే నిదర్శనం
- శాసన మండలి విప్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి

పట్నంబజారు: రాష్ట్రంలో ఎన్ని పార్టీలు ఏకమైనా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అఖండ విజయాన్ని అడ్డుకోలేవని శాసన మండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. అందుకు గుంటూరు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థుల గెలుపే ప్రత్యక్ష నిదర్శనమన్నారు. గుంటూరు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా గెలిచిన కాసు వెంకటరెడ్డి, ఇతర పదవుల్లో గెలిచిన న్యాయవాదులు, పార్టీ లీగల్ విభాగం నేతలు శనివారం బృందావన్ గార్డెన్స్‌లోని కార్యాలయంలో లేళ్ల అప్పిరెడ్డిని కలిశారు. ఎన్నికల్లో గెలుపొందిన వారిని సత్కరించి, లీగల్ విభాగం నేతలను అభినందించారు. ఈ సందర్భంగా విప్ అప్పిరెడ్డి మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో కూటమి ఘోర ఓటమికి ఇది తొలి మెట్టు అని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోనే గుంటూరు బార్ అసోసియేషన్‌కు ఘన చరిత్ర ఉందన్నారు. తాజాగా టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలతో పాటు కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలన్నీ ఓవైపు జత కట్టి జరిపిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో కేవలం ఒంటరిగా వైఎస్సార్ సీపీ ఇచ్చిన మద్దతుతో సాధించిన ఈ గెలుపు రానున్న ఎన్నికల్లో కూటమి ఓటమికి నిదర్శనమన్నారు. వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలూరి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన కాసు వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడు గౌరీశంకర్, లైబ్రరీ సెక్రటరీ పల్లె నరసింహారావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ అంకమ్మరావు, యామినీ, బార్ కౌన్సిల్ మెంబర్ బ్రహ్మారెడ్డి, పార్టీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు సీడీ భగవాన్, అబ్రహాం లింకన్, సయ్యద్ బాబు, ఝాన్సీ, మారెళ్ల రేవతి, మంజుల, వరదాయని, శ్యామల, సోని, అనూష, వెంకటరమణ, మొండితోక శ్రీను, బాబు, కొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, క్రాంతి పాల్గొన్నారు.



గవర్నమెంటు ప్లీడర్ మారెళ్ల వెంకటసుబ్బారెడ్డిని సన్మానిస్తున్న లీగల్ సెల్ మాజీ అధ్యక్షుడు పోలూరి

ప్రభుత్వ న్యాయవాదిగా మారెళ్ల

నగరంపాలెం: జిల్లా కోర్టు ప్రభుత్వ న్యాయవాది (జి.పి)గా మారెళ్ల వెంకట సుబ్బారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం గుంటూరు జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న జి.పి. కార్యాలయంలో శనివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆయనతోపాటు సహాయ ప్రభుత్వ న్యాయవాది (ఏజీపీ)గా మాజేటి సౌభాగ్యలక్ష్మి కూడా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి నుంచి మూడేళ్లపాటు వారిద్దరూ కొనసాగనున్నారు. ది గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి, బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజోన్నల బ్రహ్మారెడ్డి, గోళ్ళ మాధవి, వైఎస్ఆర్‌సీపీ లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి పొలూరి వెంకటరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు సి.డి.భగవాన్, వైఎస్ఆర్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి నూరిఫాతిమా, న్యాయవాదులు కళ్ళం వెంకటరమణ రెడ్డి, వజ్రాల రాజశేఖర్‌రెడ్డి, అబ్రహంలింకన్, వాసన్ సూరిబాబు, జీవా, నాని, ఏఆర్ఎస్ మూర్తి తదితరులు హాజరై, వారిని అభినందించి సన్మానించారు.

ఓటు హక్కుపై చైతన్యం.. అభినందనీయం

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజంలో వివిధ హోదాల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన వారు ఉద్యోగ విరమణ అనంతరం ప్రజాస్వామ్యం గొప్పదనాన్ని, పవిత్రతను గుర్తించి ఓటు హక్కుపై బాధ్యత గల పౌరులుగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు ముందుకు రావడం అభినందనీయమని పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల అధికారి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. 'లెట్స్ ఓట్' స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శనివారం రాజ్యలక్ష్మిని ఆమె కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా లెట్స్ ఓట్ గుంటూరు చాప్టర్ కన్వీనర్ టి.బాలాజీ శ్రీనివాస్ మాట్లాడుతూ 'ఒక్క ఓటు–మనదేశ భవిష్యత్తు' అనే నినాదంతో విద్యాధికులు ఎక్కువ శాతం ఓటు వేసేలా చూడటం, ఓటును అమ్ముకోకుండా చైతన్య పర్చే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భావితరాలకు రాజకీయ ఆసక్తి కల్పించే విధంగా చూడడం, నోటాకు ఓటు వేయకుండా చూడటం తదితర అంశాలపై వాకింగ్ ట్రాక్స్, పార్కులు, అపార్ట్‌మెంట్లు, స్టేడియాలు, జన సంచార ప్రాంతాల్లో చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లెట్స్ ఓట్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ కె.మాలకొండయ్య, ఎల్‌ఐసీ ప్రతినిధి కె.సీతా రమేష్, బ్యాంక్ ప్రతినిధి ఆకురాతి అమర్నాథ్, వీపీ సోమయాజులు, పీవీ సత్యనారాయణ, ప్రజా ఆలోచన వేదిక అధ్యక్షుడు మేడూరి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

చోరీ ఘటనపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్లు చోరికి గురైన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసునమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అరండల్‌పేట 14/2వ లైనులో భవనంపై అంతస్తులో విద్యార్థులు అద్దెకు ఉంటున్నారు. చల్లగాలి కోసం వారు తలుపులు తీసి శుక్రవారం నిద్రించారు. గదిలోని ఒక ల్యాప్‌టాప్, మూడు సెల్‌ఫోన్లు చోరికి గురయ్యాయి. బాధితుడు గణేష్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నర్సింగ్ వృత్తి పవిత్రమైంది



గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో నర్సింగ్ ఆఫీసర్‌గా పని చేస్తున్న ఆర్.సూర్యకాంతం ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం శుశ్రుత హాలులో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. నర్సింగ్ వృతి పవిత్రమైనదని, రోగుల జీవితాలతో ముడిపడి ఉందన్నారు. వృత్తి పట్ల అంకిత భావంతో పని చేయాలని ఆయన సూచించారు. అనంతరం సూర్యకాంతంను శాలువా కప్పి, సత్కరించారు. ఆమె చేసిన సేవలను పలువురు కొనియాడారు.

వడ్డీ రాయితీ పన్ను చెల్లింపు గడువు నేటితో ఆఖరు

రాత్రి 11 గంటల వరకు అందుబాటులో క్యాష్ కౌంటర్లు

నెహ్రూనగర్: పన్ను బకాయి ఏక మొత్తంగా చెల్లించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన వడ్డీ రాయితీ గడువు నేటితో ముగియనున్న నేపథ్యంలో పన్ను చెల్లింపుదార్లకు వీలుగా ఉదయం 8 నుంచి రాత్రి 11 గంటల వరకు క్యాష్ కౌంటర్లు పని చేసేలా చర్యలు తీసుకున్నామని, బకాయిదార్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పన్ను బకాయి అంతా ఏక మొత్తంగా చెల్లించిన వారికి వడ్డీ రాయితీ ప్రకటించిందని, ఆదివారం లోపు ఖాళీ స్థల పన్ను పూర్తిగా చెల్లించి, వడ్డీ రాయితిని పొందాలని పేర్కొన్నారు. ఏప్రిల్ 1 నుంచి పన్నుపై వడ్డీ యథావిధిగా జమ అవుతుందని, బకాయిదార్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధ చేసినట్లు చెప్పారు. నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయాల్లో క్యాష్ కౌంటర్లతో పాటుగా, భారత్ పేటలోని 140, పెద్ద పలకలూరు రోడ్డులోని 106, వసంతరాయపురం మెయిన్ రోడ్డులోని 148 వార్డు సచివాలయాల్లోని క్యాష్ కౌంటర్లు ఉదయం 8 నుంచి రాత్రి 11 గంటల వరకు పనిచేస్తాయని తెలిపారు.

విద్యాభివృద్ధికి జీవితం అంకితం చేసిన కన్న మాస్టారు

ఏఎన్‌యూ వీసీ, ఆచార్య రాజశేఖర్



ఎమ్మెల్సీ లక్ష్మణరావుకు అవార్డు అందజేస్తున్న ఆచార్య రాజశేఖర్, కన్న మాస్టారు

గుంటూరు ఎడ్యుకేషన్: పేద, మధ్య తరగతి విద్యార్థుల విద్యాభివృద్ధికి జీవితం అంకితం చేసి, వేలాది మందిని విద్యావంతులుగా కన్న మాస్టారు తీర్చిదిద్దారని ఏఎన్‌యూ వీసీ, ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. శనివారం మార్కెట్ సెంటర్‌లోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో కన్న విద్యా సంస్థల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథి ఆచార్య పి.రాజశేఖర్ మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగాన్ని వదులుకుని, ఐదు దశాబ్దాలకుపైగా సమాజాన్ని తనదైన దృష్టితో చూస్తూ.. వేలాది మందిని విద్యావంతులుగా తీర్చిదిద్దిన కన్న మాస్టారు విద్యాసేవలు జాతీయస్థాయి పురస్కారానికి అర్హత అని పేర్కొన్నారు. విశిష్ట అతిథి ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. కుటుంబానికంటే మిన్నగా విద్యార్థులను, పాఠశాలను అమితంగా ప్రేమించే కన్న మాస్టారు రెండు తరాలను తీర్చిదిద్దారన్నారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీగా ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న కేఎస్ లక్ష్మణరావు అమెరికాలోని నాట్స్ సంస్థ నుంచి అందుకున్న 'యాన్ ఐకాన్ ఆఫ్ నాలెడ్జ్ అండ్ సర్వీస్' అవార్డును వీసీ రాజశేఖర్, కన్న మాస్టారు, పలు విద్యా సంస్థల డైరెక్టర్ల సమక్షంలో ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కన్న స్కూల్ ప్రిన్సిపల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి అరుదైన శస్త్రచికిత్స

- రోగి మెలకువగా ఉండగానే బ్రెయిన్ సర్జరీ
- ఆరోగ్యశ్రీతో ఉచితంగా ఆపరేషన్



వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ సత్యారెడ్డి

గుంటూరు మెడికల్: మెదడులో కణితి ఉండి 14 ఏళ్లుగా ఫిట్స్‌తో బాధపడుతున్న వైద్య విద్యార్థికి అరుదైన శస్త్ర చికిత్స చేసినట్లు న్యూరో సర్జన్ డాక్టర్ కాళహస్తి సత్యారెడ్డి చెప్పారు. శనివారం గుంటూరు కొత్తపేట ఓల్డ్ క్లబ్ రోడ్డులోని తులసి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గుంటూరు జిల్లాలోని చేబ్రోలు మండలం శలపాడు గ్రామానికి చెందిన జమ్ముగాని జయ సాయికృష్ణ ఫిలిప్పైన్స్ దేశంలో ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడని తెలిపారు. ఎనిమిదో తరగతి చదువుతున్న నాటి నుంచి తలలో ఐదు సెంటీమీటర్ల ట్యూమర్ ఉండి, ఫిట్స్ సమస్యతో బాధపడుతున్నాడన్నారు. ఫిట్స్ నియంత్రణ కోసం మందులు వాడుతున్నా.. ఫలితం లేకపోయేసరికి చికిత్స కోసం తమ వద్దకు వచ్చినట్లు డాక్టర్ సత్యారెడ్డి చెప్పారు. ఈ నెల 24న రోగి మెలకువలో ఉండగానే బ్రెయిన్ సర్జరీ చేసి, ట్యూమర్‌ను తొలగించామన్నారు. వైద్య విద్యార్థి చేతితో పెయింటింగ్ వేస్తున్న సమయంలో సుమారు మూడు గంటలసేపు ఆపరేషన్ చేసి, ట్యూమర్‌ను తీసివేశామని చెప్పారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేసినట్లు వెల్లడించారు. ఆపరేషన్ ప్రక్రియలో తనతోపాటుగా మత్తు వైద్య నిపుణురాలు డాక్టర్ ఆళ్ల ప్రశాంతి, ప్రవీణ్ పాల్గొన్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో డాక్టర్ కంకర సోమశేఖరరెడ్డి, డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ దీప్తి, డాక్టర్ రాఘవ, డాక్టర్ శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

ట్రాఫిక్, ఆర్టీవో అధికారుల ప్రత్యేక తనిఖీలు



తనిఖీల్లో పాల్గొన్న డీటీసీ కరీం, డీఎస్పీ నాయుడు


పట్నంబజారు: గుంటూరు నగరంలో శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనదారులు నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో గుంటూరు నగర ట్రాఫిక్ పోలీసులు, ఆర్టీఓ అధికారులు సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. లక్ష్మీపురం, బృందావన్ గార్డెన్స్ ప్రధాన రహదారుల్లో ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. అతివేగంగా స్నేక్ డ్రైవ్, మల్టీ హారన్, సైలెన్సర్లు మార్పులు చేసుకుని వాహనాలు నడుపుతున్న వారిపై కొరడా ఝుళిపించారు. డీటీసీ షేక్ కరీం, ట్రాఫిక్ డీఎస్పీ నాయుడు కలిసి ఈస్ట్, వెస్ట్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లతో తనిఖీలు చేశారు. మొత్తం 45 ద్విచక్ర వాహనాలపై కేసులు నమోదు చేసి, సీజ్ చేశారు. తనిఖీల్లో ట్రాఫిక్ సీఐలు డి.కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు గోపాల్, ప్రసాద్, మల్లేశ్వరి, గంగాధర్ ప్రసాద్, సౌజన్య, రాఘవరావు, మధుసూదనరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీటీసీ కరీం మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా, ప్రజలను ఇబ్బంది పెట్టే విధంగా వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రహదారి భద్రత నిబంధనలు ఉల్లంఘించే ద్విచక్ర వాహనదారులను విచారిస్తున్నట్లు చెప్పారు.

14 సవర్ల బంగారం చోరీ..

పెదకాకాని: గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి, 14 సవర్ల బంగారం ఆభరణాలు చోరీ చేసిన ఘటనపై కేసు నమోదైంది. వివరాల మేరకు.. మండలంలోని వెనిగండ్ల గ్రామానికి చెందిన చిరందాసు శివనాగేశ్వరమ్మ ఒక్కరే ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఉద్యోగ రీత్యా కుమారుడు, కోడలు గుంటూరులో ఉంటున్నారు. శివనాగేశ్వరమ్మ రోజూలానే శుక్రవారం.. ఇంటి వెనుక వాకిలి అరుగుపై కూర్చుని.. ఇంట్లోకి వెళ్లింది. రాత్రి 9:30 గంటల సమయంలో బీరువా తలుపులు తెరచి ఉండటాన్ని గుర్తించింది. అయితే ఈ విషయాన్ని శనివారం ఉదయం తన కుమారుడు చిరందాసు బాలసుబ్రమణ్యంకు శివనాగేశ్వరమ్మ చెప్పింది. బీరువా తలుపులు రాత్రి ఎవరో తీసి ఉంచారని, ఏమైన వస్తువులున్నాయా అని అడిగింది. దీంతో అతను హాడావుడిగా ఇంటికి చేరుకుని బీరువా పరిశీలించగా.. అందులో ఉన్న హారం, నక్లెస్, బుట్టలు, చంపాశవర్లు, పాపిడి బిళ్లలు కనిపించలేదు. దీంతో పెదకాకాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసు సిబ్బంది క్లూస్ టీం ద్వారా ఘటన ప్రాంతంలో వేలిముద్రలు సేకరించి, వివరాలు నమోదు చేసుకున్నారు. చోరీకి గురైన బంగారు ఆభరణాల విలువ రూ.7లక్షల వరకు ఉంటుందని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు శనివారం సీఐ కె.వీరాస్వామి తెలిపారు.

సాయుధ బలగాలతో కవాతు

ట్రైనీ డీఎస్పీ గీతాకుమారి



మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న ట్రైనీ డీఎస్పీ గీతాకుమారి, ఎస్‌ఐ

ప్రత్తిపాడు: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించనున్నామని ట్రైనీ డీఎస్పీ గీత అన్నారు. శాంతియుతంగా ఎన్నికలు జరపడమే లక్ష్యంగా పోలీసు శాఖ గత కొద్ది రోజులుగా గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా శనివారం ప్రత్తిపాడు నోడల్ ఆఫీసర్ నిసార్‌బాషా ఆధ్వర్యంలో మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన కొండేపాడు, నడింపాలెం, తిక్కిరెడ్డిపాలెంలో అదనపు సాయుధ పోలీసు బలగాలతో కవాతు (మార్చ్ ఫాస్ట్) నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనీ డీఎస్పీ గీతాకుమారి మాట్లాడారు. వివాదాలకు ప్రజలు, రాజకీయ పార్టీలు దూరంగా ఉండాలన్నారు. ఎస్‌ఐ సోమేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి గడువు పొడిగింపు

గుంటూరు ఎడ్యుకేషన్: తాడికొండలోని ఏపీ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి, 6, 7, 8 తరగతుల్లో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు ఆదివారం ముగియనున్న ఆన్‌లైన్ దరఖాస్తు గడువును ఏప్రిల్ 5వ తేదీకి పొడిగించినట్లు ఏపీ ఆర్ఎస్ జిల్లా కన్వీనర్ జె.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగరంలోని మైనార్టీ గురుకుల బాలబాలికల పాఠశాలల్లో మైనార్టీ విద్యార్థులు మే 1 నుంచి 5వ తరగతితో పాటు 6, 7, 8 తరగతుల్లో ఖాళీల భర్తీకి నేరుగా ప్రవేశం పొందవచ్చని పేర్కొన్నారు.